క్లుప్తంగా

లఘుచిత్రం టీజర్ విడుదల



లఘు చిత్రం టీజర్ పోస్టర్‌ను విడుదల చేసిన ఏఎస్పీ అంకితా సురానా

పార్వతీపురం రూరల్: భగవద్గీత ఆధారంగా వైఎస్‌కే మూవీస్ యుట్యూబ్ చానల్ రూపొందించిన మోటివేషనల్ లఘు చిత్రం 'గీత ఈజ్ మై ఫ్రెండ్ (సర్వం పరమాత్మమయం)' టీజర్‌ను పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా సోమవారం తన కార్యాలయంలో లఘుచిత్రం యూనిట్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనోస్థైర్యానికి మించిన ఆయుధం లేదన్నారు. చెడు వ్యసనాలకు బానిసై సర్వం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడే యువకుడిని భగవద్గీత సారాంశంతో మామూలు మనిషిని చేసి ఆత్మస్థైర్యాన్ని నింపే కథాంశంగా రూపొందిన ఈ లఘు చిత్రం యూనిట్‌కి ఏఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె టీజర్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో దర్శకుడు ఏగిరెడ్డి సతీష్‌కుమార్, నటులు వి. దాలినాయుడు, మహేశ్వర అజయ్‌లు ఉన్నారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలుచేయాలని గ్రామసేవకుల(వీఆర్‌ఏ) సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు సోమవారం సాలూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాచేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ, అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, అక్రమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో వీఆర్‌ఏల సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని లేకుంటే సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలకు సిద్ధపడతామని స్పష్టంచేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, నరేష్, మోహన్, రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బాలగుడబలో 104 వైద్యశిబిరం



వృద్ధులను తనిఖీ చేస్తున్న డా.శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరం ద్వారా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బందలుప్పి వైద్యాధికారి డా.శ్రీకాంత్ రోగులకు వైద్యపరీక్షలు చేసి సరిపడా మందులను సరఫరా చేశారు. ఈ మేరకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు అవసరమైన వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో అస్వస్థతకు గురైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో 104 వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివలింగాకారంలో ప్రసాదం తయారీ



పలగర వినాయక విగ్రహం వద్ద తయారైన శివలింగాకారం ప్రసాదం

బలిజిపేట: వినాయక ఉత్సవాలు మండలంలో కొనసాగుతున్నాయి. భక్తులు వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటుచేసే ప్రసాదాల తయారీలో కొత్త తరహాలో నివేదన చేస్తున్నారు. లడ్డూ ప్రసాదం వివిధ ఆకారాలలో తయారుచేయాలని స్వీట్‌షాపు యజమానులను కోరడంతో వారు ఆ విధంగా కొత్త తరహాలో తయారు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పలగరలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్దకు బలిజిపేటలోని లక్ష్మీప్రియ స్వీట్‌స్టాల్‌లో 11కిలోల లడ్డూ బూందీతో శివలింగాకారంలో ప్రసాదం తయారుచేసి నివేదించారు.

మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు సరికాదు

పార్వతీపురం: మహిళలపట్ల కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం బీజేపీ శ్రేణులు ప్లకార్డులతో నిరసన తెలిపి ఆర్‌టీసీ కాంప్లెక్స్‌వద్ద ర్యాలీ, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోడీ మాతృమూర్తి పట్ల అనుచిత పదజాలం వాడి అగౌరవపరిచిన రాహుల్‌గాంధీ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.సంజీవి, నాయకులు చంద్రమ్మ, భాను, వి.పార్వతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌తో విడదీయరాని బంధం

సీతానగరం:

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో సీతానగరం మండల ప్రజానీకానికి విడదీయరాని బంధం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం 2005లో నిర్వహించిన రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం నుంచి లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం వరకూ బస్సుయాత్ర జరిగింది. పార్వతీపురం నుంచి వస్తున్న నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కాన్వాయ్ జోగింపేట వచ్చే సమయానికి మధ్యాహ్నం 12 గంటలైంది. రాష్ట్రరహదారిని ఆనుకుని ఉన్న జోగింపేట పట్టుపరిశ్రమ తోటలో మధ్యాహ్నం ఆయన విశ్రాంతి తీసుకున్నారు. విశ్రాంతి తీసుకున్న సమయంలో మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యపరంగా వెనుక బడిన ఈ ప్రాంతంనుంచి విద్యాధికులను చేయడానికి ప్రణాళికలు తయారుచేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశించిందే తడవుగా జోగింపేట పట్టుపరిశ్రమ భూ విస్తీర్ణమెంత? పట్టు పరిశ్రమ ఎన్నాళ్ల నుంచి మూతపడింది? విద్యాలయాలకు అవసరమైన స్థలం ఎంత? సంబంధిత విద్యాశాఖ, పట్టు పరిశ్రమల శాఖల అధికారులనుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాన్వాయ్ విజయనగరం చేరేలోగా జోగింపేటలో 6 జిల్లాల్లోని గిరిజన కుటుంబాల పిల్లలకు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎస్సీ కుటుంబాల వారి పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడానికి భవన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.



జోగింపేటలో మహానేత బస చేసిన ప్రాంతంలో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వైఎస్సార్



గిరిజన విద్యార్థుల వసతిగృహం

అన్ని వసతులతో గిరిజన ప్రతిభా విద్యాలయం



జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయ ప్రాంగణం

ఈ నేపథ్యంలో 5 ఎకరాల విస్తీర్ణంలో అంతలోనే 800 మంది గిరిజన విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన భవనాలతో రూ.4.50 కోట్లతో గిరిజన ప్రతిభా విద్యాలయం మంజూరుచేశారు. గిరిజన ప్రతిభావిద్యాలయాన్ని ఆనుకుని ఉన్న పట్టు పరిశ్రమ తోటలో 8.50 ఎకరాల విస్తీర్ణంలో 800 మంది విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన భవనాలు రూ.16 కోట్ల వ్యయంతో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అలాగే బాలికలకు ప్రత్యేకించి 2.2 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.50 కోట్లతో 250 మందితో కేజీబీవీ నిర్మాణానికి అప్పట్లోనే పనులు చేపట్టారు. గిరిజన ప్రతిభా విద్యాలయంలో విద్యనభ్యశించిన గురిపుత్రులు ఇంజినీర్లు, డాక్టర్ , శాస్త్రవేత్తలుగా దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. వందలాది మంది యువకులు ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు.

కొత్తవలస ఆనకట్టపై రాకపోకలు బంద్

- మూడు మండలాల ప్రజలకు ఇబ్బందులు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామం సమీపంలోని కొత్తవలస ఆనకట్టపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో మూడు మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బది ఏర్పడింది. ఈ ఆనకట్టపై నుంచి మక్కువ, సీతానగరం, పార్వతీపురం మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. వరదనీరు ఉధృతంగా ఆనకట్టపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు సాగించేందుకు అవకాశం లేక ప్రయాణికులు సుదూర ప్రాంతాలనుంచి వారి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఆనకట్టపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో, పలువురు వాహనదారులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆనకట్టపై నుంచి వర్షాకాలంలో నిత్యం వరదనీరు ప్రవహిస్తుండడంతో నాచుపడుతోంది. దీంతో పలువురు వాహనదారులు ఆనకట్టపై నుంచి జారిపడి మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కొత్తవలస ఆనకట్టపై బ్రిడ్జిని నిర్మించాలని మూడు మండలాల కు చెందిన ప్రజలు కోరుతున్నారు.



కొత్తవలస ఆనకట్టపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో సోమవారం జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. గ్రామంలో కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ స్వయంగా మండల అధికారులతో ఇంటింటికీ వెళ్లి బడుగు, బలహీన వర్గాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు. పింఛన్ పంపిణీ కేవలం సంక్షేమం మాత్రమే కాదని, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను వ్యక్తం చేస్తుందని కలెక్టర్ అన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు.



పించన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జల దాసు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు ఎం .సుధారాణి, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ కె కుమార వర్మ, సంక్షేమ సహాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు

- ఏపీ అంగన్వాడీ యూనియన్ నిరాహారదీక్షలు

పార్వతీపురం రూరల్: అర్హత కలిగిన అంగన్వాడీ హెల్పర్లకు జీఓ నంబర్ 2 ప్రకారం వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జీఓ నంబర్ 2 మేరకు హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని ప్రత్యేక జీఓ ఉన్నప్పటికీ జిల్లా అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఓ అమలు జరుగుతున్నప్పటికీ జిల్లాలో మాత్రం అధికారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ఐసీడీఎస్ పీఓ, పీడీలు, కలెక్టర్‌ను కలిసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రిలేనిరాహారదీక్షలు చేపట్టామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. లేకుంటే 7వ తేదీవరకు దీక్షలు కొనసాగించి 8న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, యూనియన్ జిల్లా నాయకులు గౌరీమణి, సత్యవతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మాటలు హాస్యాస్పదం



పెద్దగెడ్డ జలాశయంలో గతంలో చేపపిల్లలు విడుదల చేస్తున్న ఫొటోను చూపిస్తున్న ఎంపీపీ బి.ప్రమీల

- ఎంపీపీ బి.ప్రమీల

పాచిపెంట: వాస్తవాలు తెలుసుకోకుండా తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి అసత్యాలు మాట్లాడడం హాస్యాస్పదమని, ఎంపీపీ బి. ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌లో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు పత్రికా సమావేశాలు నిర్వహించి పెద్దగెడ్డ జలాశయం మత్స్యకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కనీసం ఒక్క చేప పిల్ల కూడా జలాశయంలో విడుదల చేయలేదని, ప్రమాదవశాత్తు జలాశయంలో గల్లంతై మృతి చెందిన కుటుంబాలను ఆదుకోలేదని మాట్లాడడం పూర్తి అవాస్తమని ఖండించారు. గత ప్రభుత్వం హయాంలో పెద్దగెడ్డ జలాశయంలో తన చేతుల మీదగా చేప పిల్లలు విడుదల చేసిన ఫొటోలను విలేకరుల ముందు ఉంచారు. అంతేకాకుండా ప్రమాదవశాత్తు పెద్దగెడ్డ జలాశయంలో గల్లంతై మృతి చెందిన గిరిజన మత్స్యకారుడు బంటు జోగయ్య కుటుంబానికి మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర కృషితో, వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా రూ.ఐదు లక్షలు, వైఎస్సార్ ప్రమాద బీమా ద్వారా మరో రూ.ఐదు లక్షలు మృతుడి కుటుంబానికి అందించామన్నారు. అలాగే చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు భద్రత నిమిత్తం సుమారు 30 నుంచి 40 లైఫ్ జాకెట్లతో పాటు వలలు కూడా అందించినట్లు ఆమె పేర్కొన్నారు. తాను పక్కా ఆధారాలతో మాట్లాడుతున్నానని, తెలుగుదేశం పార్టీ నాయకుల మాదిరిగా అసత్యాలు మాట్లాడడం లేదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు ఏది పడితే అది మాట్లాడితే ప్రజల ముందు నవ్వుల పాలవుతారన్నారు. ఇకనైనా తెలుగుదేశం పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

ఎస్సీ మహిళలకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాలలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు జిల్లా లోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు సెప్టెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తుకు కనీసం ఒక సంవత్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ పత్రాలను జత చేసి కార్యనిర్వాహక సంచాలకుడు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ, డా.మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం–535 003 వారి కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోగా సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 90300 14742, 96424 60838, 96526 00967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

నేలపైనే చదువులు



జిల్లేడు వలస ప్రాథమిక పాఠశాలలో నేలపైన కూర్చున్న విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని జిల్లేడువలస ప్రాథమిపాఠశాలలో విద్యార్థులు నేలపైనే కూర్చుంటూ పాఠాలు నేర్చుకుంటున్నారు. ఈ పాఠశాల రేకులు షెడ్డులో నిర్వహిస్తుండడంతో ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు రేకుల వేడి నేరుగా పిల్లలపైనే ఉంటుంది. గిరిజన గ్రామాలలో పాఠశాలలకు భవనాలు లేకపోవడమే కాక కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా లేవు. అలాగే పాఠశాలలు మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి శరవేగంగా జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జీవో నంబర్ 3ను కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాచిపెంట: జీవో నంబర్ 3ను కొనసాగించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు సూకురు అప్పలస్వామి, మంచాల శ్రీనివాసరావు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నూటికి నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకే కల్పించాలన్నారు. మెగా డీఎస్సీ నుంచి గిరిజనులను తొలగించి గిరిజనుల ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. గిరిజన యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గిరిజనులు పోరాడి సాధించుకున్న గిరిజన హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని, గిరిజనులకు సీపీఎం పూర్తి మద్దతుగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్ వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో పలువురు యువత, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచండి

పార్వతీపురంటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో పార్వతీపురం ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లి పేరు మీద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం తల్లికి మనమిచ్చే ప్రేమ, గౌరవమని ఆయన అన్నారు. పెరిగిన చెట్టు తల్లిలాగా ప్రతిఫలం ఆశించకుండా మనకు జీవితానిస్తుందని పేర్కొన్నారు. యువత ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలని సూచించారు. మొక్కలు పెంచి ప్రాణదాతలు కావాలని జడ్జి కోరారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను నాటి, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ టి.జోగారావు, వెంకట్రావు, ఎం .కృష్ణారావు, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనంతరావు, పాండ్రంకి సంతోష్ కుమార్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్. దామోదరరావు

నిర్వహణకు నోచుకోని సౌర విద్యుత్ తాగునీటి పంపు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ బొర్రమామిడివలసలో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద సోలార్ విద్యుత్ ఆధారిత పంపు గత ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అయితే ఈ పంపు సెట్ మరమ్మతులకు గురైతే కింద ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలే తప్ప స్థానికులు ఎలాంటి మరమ్మతులు చేయకూడదని బోర్డుపై రాసి ఉంచారు. అయితే మరమ్మతుల బారిన పడిన విషయాన్ని తెలిపేందుకు బోర్డుపై ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసిన ఎవరూ స్పందించడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఏర్పాటు చేసిన తొలి రోజుల్లో ఈ బోరు ద్వారా మంచి తాగునీరు అందేదని గ్రామస్తులు చెబుతున్నారు. మారుమూల గ్రామాలకు ఇలాంటి సౌర విద్యుత్ తాగునీటి పంపులు మండలంలోని పలు గ్రామాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వాటికి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయని గిరిజనులకు తాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.



బొర్రమామిడి వలసలో అలంకార ప్రాయంగా ఉన్న సౌర విద్యుత్ తాగునీటి పంపు

గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలుతీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి

సీతానగరం: గర్భిణుల ఆరోగ్య భద్రతకు అధికార సిబ్బంది ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను, మందులు, ల్యాబ్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను, రోగులకు అందిస్తున్న సేవల రికార్డులను పరిశీలించారు. అనంతరం అంటిపేటలో పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలోనిర్వహించిన ఉచితవైద్య శిబిరాన్ని సందర్శించి గర్భిణులకు అందిస్తున్న సేవలపై సూచనలు చేశారు.గర్భిణుల్లో హిమోగ్లోబిన్ లోపాన్ని అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గర్భిణులను ప్రతినెలా తనిఖీ చేయడంతో పాటు ప్రసవ సమయంలో ఆస్పత్రుల్లో చేర్పించేలా చైతన్య పర్చాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి

వివేకానందుడు యువతకు స్ఫూర్తి ప్రదాత

సాలూరు: స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తి ప్రదాతఅని రాష్ట్ర స్త్రీశిశు,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని 3వ వార్డులో వివేకానంద విగ్రహాన్ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు, ఆలోచనలు నేటి సమాజానికి ఆదర్శమన్నారు. ఆయన ఆచరణలో పెట్టిన విలువలను యువత అనుసరించి దేశనిర్మాణంలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పట్టణంలోని 3వ వార్డు గుమడాంలో పలువురు పింఛన్ లబ్ధిదారులకు మంత్రి సంధ్యారాణి సోమవారం పింఛన్ సొమ్ము అందజేశారు.



వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న భవన నిర్మాణ కార్మిక నాయకులు

సాలూరు: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్‌వైనాయుడు, కమిటీ నాయకులు రౌతు చిన్నయ్య, మోహన్‌లు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి నేటి వరకు పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్లైయిమ్‌లను పరిష్కరించాలన్నారు. వసూలు చేసిన సెస్ నిధులను సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవననిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో నిర్మాణ కార్మికులకు అమలుచేస్తున్న భద్రతను రాష్ట్రంలోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీను, సత్యనారాయణ,జగదీష్,అప్పారావు పాల్గొన్నారు.



బలిజిపేట: తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బలిజిపేటలో..

బలిజిపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ బాలమురళీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం బలిజిపేట మండల కార్యదర్శి చక్రధర్, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరినాయుడు, తవిటయ్య, చంటి, ఈశ్వరరావు, జయరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డీఈఓ, డీడీలను నియమించాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారిని, ఐటీడీఏకు రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఐటీడీఏఏ పీఓ వైశాలికి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు రెగ్యులర్ డీఈఓ, డీడీ లేకపోవడంతో గిరిజన విద్య, పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ వర్కర్లకు ఆశ వర్కర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు.